



• బులుసు ప్రకాశమ్మ •

మద్రాసు బీచి. సాయంత్రం. ఎనిమిదిదగ్గర.

సుందరి–పదిహేడేళ్లుంటాయి. సామాన్యమైన వేషం. అపురూపమైన చక్కదనం. యోచిస్తున్నట్టు కనబడే ముఖము.

కృష్ణరావు–ముప్ఫైలోపు వయస్సు. బెంగాలీ ఫేషను, ఇటుఅటు చూస్తూ నడిచే అలవాటు. ఏదో చెయ్యాలన్న ఆశ స్ఫురిస్తూ ఉంటుంది, చూపుల్లో. సుందరివేపు వస్తూవుంటాడు.

సుందరి

(ఇసుగలో వేలితో గీస్తూ)

తే. గీ. దృష్టిగోచరమైన ఈ సృష్టియెల్ల
ఏమియును గాదు నాకు నేనేమి గాను
బంధనముకంటె లేని ఈ పరుల యింట
ప్రేమ యేటికి — — — —

అని అప్పుడప్పుడు అనిపిస్తూఉంటుంది. ఇంతకీ చేసుగున్న—

(కృష్ణరావువైపు నిదానంగా చూసి ఖంగారుగా లేవబోతుంది.)

కృష్ణరావు

వద్దు వద్దు లేవకండి. కూచోండి. నేను కాస్సేపు కూచుని మీతో మాట్లాడుదామనే వస్తున్నాను. 'లిశనర్'లో చూశాను మిమ్మల్ని. 'లక్ష్మీసుందరి' అవునా ?

సుందరి

(కృష్ణరావు మాటలు వినగానే తన ఖంగారుకి తానే నవ్వుకుంటూ కూచుంటుంది.)

కృష్ణరావు

నిన్నరాత్రి రేడియోలో విన్నాను మీ పాట. ఆహా ! అమరగానం ! వొళ్లు తెలియలేదు నాకు.

సుందరి

(తలవంచుగుంటుంది)

కృష్ణరావు

పాడతాం పాడతాం అంటూ బయలుదేరేవాళ్లే గాని ఇంత చక్కగా పాడినవాళ్లు లేరు.

సుందరి

(ముఖం ఎర్రబడుతుంది. మళ్ళీ స్థిమితపడ్డ లక్షణాలు కనిపిస్తాయి) .

కృష్ణరావు

ఆపాటి ఈపాటి అనుకుంటున్నారు కాబోలు మీ పాట.

సుందరి

మా వాళ్లు వెతుక్కుంటూంటారు, నా కోసం. వెడతాను (లేవబోతుంది)

కృష్ణరావు

లేవకండి. మీతో నాలుగుమాటలు మాట్లాడుదామని వచ్చాను. కూచోవాలని ప్రార్థన.

---

సుందరి

ఎంతమాట. (నవ్వుతుంటూ కూచుంది. చెప్పండి ఆ చెప్పదలచినదేదో అన్నట్టు చూస్తూ)

కృష్ణరావు

మీ పాట నిజంగా అమృతస్రవంతి.

సుందరి

అతిగా పొగుడుతున్నారు మీరు నన్ను.

కృష్ణరావు

నా బంధువుల్లో, స్నేహితుల్లో, ఆఖరికి ఎరుగున్న వాళ్ళల్లో ఎవళ్లయినా సరే ఇంత చక్కగా పాడితే ఆఖరికి పాడదామని ప్రయత్నమేనా చేసుంటే నెత్తినెట్టుగు పూజిద్దును.

సుందరి

(వెంకితనం సూచించే ధ్వనితో) అంత ప్రీతా మీకు పాటంటే ?

కృష్ణరావు

ఒక్క పాటేనా! సరదాగా నవ్వుతూ ఆడుతూ పాడుతూ శుభ్రంగా చీరకట్టుగుని తల్నిండా పువ్వు పెట్టుగుని కంటికింపుగా — వెధవకొంపలు మావి-జిడ్డోడుతూ (ఎక్కడో ఆలోచిస్తున్నట్టు కనబడతాడు)

సుందరి

(కనబడీ కనబడని వెటకారంతో తల వూపుతూ) రసగ్రహణపారీణులంటే మీరేనండీ! మాధుర్యం అనుభవించి ఆనందంతో ఆవేశం చెందగల శ్రోతను కలిగిననాడే గానవిద్య సార్థక్యం చెందిన దాతోంది. ధన్యురాలిని నేను.

కృష్ణరావు

ఒక్క సంగీతమే కాదు. లలితకళల్లో దేన్లోనైనా సరే ఆకర్షణీయమైన ప్రజ్ఞవుంటే చాలు. పాదాక్రాంతుణ్ణే అనుకోండి. కళలూ, సౌందర్యమూ అంటే ఏమిటో నాకు అంత పిచ్చి. పుష్పంలో సౌరభంలాగ కళాంతరంగంలో గుప్తంగా ఇమిడివున్న సౌందర్యమాధురిని హృదయంతో అనుభవించి సున్నితమైన మార్గాలద్వారా దాన్ని సామాన్యమానవులకి అందీయడం ప్రతివారికీ సాధ్యపడే పనికాదు.

సుందరి

తమరి అభిమానపాత్రమైన ప్రధానకళ యేదో తెలుసుకోవాలని కోరిక.

కృష్ణరావు

ఒకటేమిటి! చూడండి ఒక్క సంగతి చెబుతాను, ఒకవిధంగా ఆత్మస్తుతే అవుతుంది. ఏమనుకోకండి. లలితకళ ఏదైనా సరే సౌందర్యం అనుభవించి లోపాలని విమర్శించి సూక్ష్మమైన మార్గనిర్దేశం చెయ్యడంలో నాకుండుకున్న ప్రజ్ఞనీ, నిశితత్వాన్నీ గమనించి పెద్దపెద్ద సినిమాడైరెక్టరులూ ప్రొడ్యూసర్లూ మీరల్లా ఊరికే నిలుచుంటే చాలు మూడువేలిస్తాం అయిదువేలిస్తాం అంటూ ఎప్పుడూ వర్తమానాలిస్తూ ఉంటారు. మనమంటే అంత గురి వాళ్ళకి. (గర్వంగా) లాలిత్యగ్రహణం-జన్మసిద్ధంగా ఉండాలి. రమ్మంటే రాదది.

సుందరి

మీ మాటలు వింటూంటే నాకో ఆశ కలుగుతోంది. చెప్పొద్దూ, మీ వంటివారు దొరికినప్పుడే మనసులో వున్న నాలుగుమాటలూ చెప్పుగోకపోతే ఇంకెప్పుడు చెప్పుగోడం! నాకూ కూడా అప్పుడప్పుడు ఆలోచన పోతూఉంటుంది. పోనీ సినిమాఫీల్డులో ప్రవేశిద్దామా అని. మళ్ళీ లోకం ఏమంటుందో అని—

కృష్ణరావు

వెధవ లోకం. పన్లేదు లోకానికి. ఈ వేళ ఇంతముక్క నా చెవులో వేశారు గదా ఇహ చూడండి. నెల్లాళ్ళనాటికి మిమ్మల్ని ఓ పెద్ద తారని చెయ్యకపోతే. సమయమొచ్చినప్పుడు మాత్రం మొండిచెయ్యి పెట్టకండేం! నాకదే భయం మీ ఆడాళ్లతో.

సుందరి

ఎంతమాట! గాని నాకొక్కటే భయంగా వుంది. మీతో చెప్పకపోతే ఇంకెవరితో చెబుతాను గనుక. నాకు చిన్నప్పుడే పెళ్లవడం, ఈసంగీతమే కారణంగా భర్త విడిచిపెట్టేయడం రెండూ జరిగిపోయాయి. సంసార స్త్రీల వర్గానికి

చెందిన ఒక నిర్భాగ్యురాలిని నేను. ఎప్పటికేనా మళ్ళీ భర్త అనీ, సంసారమనీ, సుఖ సౌఖ్యాలనీ పొందుదామని ఆశకూడా వుంది. సినీమాల్లోకూడా ప్రవేశిస్తే...

(సుందర కంఠంలో గాద్గద్యం)

కృష్ణరావు

ఆ భయం మీకొద్దు! కళ్లు తుడుచుగోండి. మీ భర్త భక్తి దౌర్భాగ్యుడు. నవరత్నాలమూట కాళ్ల తన్నుకున్నాడు.

సుందరి

(ఆలోచనగా, ఆశగా) ఇంతటి ఆదరణ, గౌరవము చూపిస్తున్న మీమాట కాదనలేను. మీమాట ప్రకారమే నడుచుగుంటాను. సినీమాలలో పాల్గొంటాను. కాని కోపగించకండేం! మా వాళ్లొచ్చేస్తారేమో! మనసులోమాట చెబుతున్నాను. ఎంతైనా నేను ఆడదాన్ని. ఆడవాళ్లకి లోకభయం ఎక్కువ. వంకరదార్లు తొక్కి ఉన్నతపథం అందాలని కోరికలేదు. ఎప్పటికైనా ధర్మం అంగీకరించే భర్తతో సుఖించాలన్నదే నా కోరిక. రంగు పూసుగుని రంగంలోకూడా ప్రవేశించిన నన్ను భార్యగా గ్రహించడానికి పురుషహృదయం అంగీకరించదేమో అని.

కృష్ణరావు

ఇన్ని ఆలోచనలు పెట్టుగోకండి. సంసార స్త్రీలు ఏ నాడు నిర్భయంగా సినీమాలలో పాల్గొంటారో ఆ నాడే కళకు రాదగిన ఉన్నతి రావడమనేది. ముందు మీరు సినీమారంగంలో ప్రవేశించండి. మీ అమరగానం, అద్భుతవచోవిలాసం, దివ్యసౌందర్యంతో కళని ముంచి లేవనెత్తండి. దేశం మీకు జేజేలు పెడుతుంది. కోటీశ్వర్లు మీకు పాదాక్రాంతులౌతారు—ఇహను - ధర్మం అంగీకరించే భర్త అంటే పెళ్లి అని. ఏం అంతేనా? ఇంతమంది కళారాధకులు దేశసేవకులు విద్యావంతులు కుప్పతిప్పలుగా వున్న మన భారతదేశంలో మీ ఘనతనీ, ఔన్నత్యాన్నీ గౌరవించే హృదయానికి కరువుంటుందా? ఉండదు, ఉండకూడదు.

సుందరి

(విచారంతో) సంగీతం నేర్చుగున్న అపరాధానికే ఈ స్థితికి వచ్చాను నేను. సినీమారంగంలో కూడా వేలెడితే— . . .

ఓమ్

# నిత్యనవగ్రహశాంతి

సమస్త జనులకు తమ తమ జాతకములయందలి జననకాలిక గ్రహములయొక్క బలాబలముల కానుగుణ్యముగా శుభాశుభఫలములు కలుగుచుండును. మహాదశానాధ గ్రహము నీచరాశిని, నీచాంశను పొందినను, దుస్థానమందున్నను, శత్రుక్షేత్రమందున్నను, పాపగ్రహ వీక్షణ పొందియున్నను అనారోగ్యమును, అశుభఫలములను కలుగజేయును.



ఆ దశానాధునివల్ల కలిగిన అనిష్టములకు శాస్త్రోక్త ప్రకారము యదావిధిగా శాంతులు చేయుటవలన అనిష్ట పరిహారమైన జాతకుడు అభీష్టసిద్ధిని, ఆరోగ్యమును, సకలైశ్వర్యములను పొందును. అట్టి శాంతి నిధులు ప్రతిదినము ఉదయము గం॥ 6 లకు "ఏలూరులో ప్రొఫెసర్ శేఖరు" జమీందారు వారి మేడలో శ్రీ వారి యుపాస్యదేవతయగు మహాకాళీదేవి దివ్యపీఠ సన్నిధిలో జరుపబడుచున్నవి. క్రూరగ్రహ పిశాచ బాధితులు కర్మజాడ్యరోగులు ఆ సమయమునకు వచ్చినచో వారి జన్మనక్షత్ర అష్టవాక్య జపముతో అధిదేవతా ప్రత్యధిదేవతా సహిత దశాంతర్దశానాధ గ్రహముల మహామంత్ర జపమున్ను, జాతకచక్ర దోషశాంతియున్ను జరుపబడును.

కృష్ణారావు

మీ భర్త దౌర్భాగ్యుడని మొదటే చెప్పాను నేను. అతడు కళాదృష్టిలేని అంధుడు. మీ వంటి రత్నం విలువ గ్రహించలేకపోయిన శుంఠ. క్షమించండి. అతడు మిమ్మల్ని విడవడం మీ మంచికే అనుకోండి. అలాంటి మొద్దుతో మీరేం సుఖపడుతారు. నా మాట విని సినీమారంగంలో ప్రవేశించండి. తారవండి. వేలు గణించండి. ఖ్యాతిని సంపాదించండి. ఈ రోజుల్లో చాలామంది విద్యాధికులూ, పేరుపొందిన లాయర్లూ, ధనవంతులు—పెళ్ళాలు ఇంట్లో ఉన్నవాళ్ళే, నమ్మండి!—సినీమా తారని కోరి వలచి మరీ పెళ్ళాడేస్తున్నారు. తెలుసా?—అంతవరకెందుకు అటువంటి సుదినం ప్రాప్తించిననాడు కావాలంటే మిమ్మల్ని నేనే పెళ్ళాడేస్తాను.

సుందరి

(తలవూపుతూ వెటకారంగా) ఎంతటి సంస్కార హృదయులండీ మీరు. మిమ్మల్ని కలిగిన మీ కుటుంబం ఎంతపుణ్యం చేసుగున్నదో! ఒక్క మాటంటాను మన్నించండి—

మీవంటివారిని పెళ్ళాడి జీవితం సుఖమయం చేసుకోవడమంటే సామాన్యమైన సంగతి కాదు—గాని నా ఉనికివల్ల—మీ—ధర్మపత్నిగారికి కష్టం కలిగితే?

(కృష్ణారావు ముఖం పరీక్షగా చూస్తోంది.)

కృష్ణారావు

ఆ భయం మీకొద్దు. అల్లాంటి ఇబ్బందు లేవీ మీకు మా ఇంట్లో ఉండవు.

సుందరి

ఏం, మీ ధర్మపత్నిగారు అంత ఉన్నత హృదయులా?

కృష్ణారావు

మొదలు ధర్మపత్నంటూ ఉంటేగదా.

సుందరి

అదేం! ఇంతవరకూ మీరు పెళ్ళే ఆడలేదా?

కృష్ణారావు

ఆడినా ఆడనట్టే. అదో కథ. మిమ్మల్ని చూస్తుంటే, మీ మాటలు వింటూంటే నా కేవేవో జ్ఞాపకం వస్తున్నాయి. మిమ్మల్నెక్కడో చూసినట్టనిపిస్తూంది. హ—ఎందుకులెండి ఇప్పుడవన్నీ.

సుందరి

చిత్రంగా ఉంటున్నాయి మీ మాటలు—అదేముటో చెప్పరూ వినకూడితే.

కృష్ణారావు

ఏముంది నాకు చిన్నతనంలో మీలాగే ఓ సంగీతాలు పాడే అమ్మాయిని ముడెట్టారు. నాటకాలు కచ్చేరీలు ఊళ్ళో పిట్ట పిర్రుమంటే సరి. అమ్మాయిని నాన్న వెంటేసుగెళ్ళేవాడు. మోగించేవాడు. నలుగురూ ఇకిలించేవారు.

సుందరి

ఆ అయితే మీ రేంజేశారు అప్పుడు?

కృష్ణారావు

ఏముంది మావాళ్ళంతా [illegible]టి సంసారి ఆడాళ్ళకి సభలేమిటి మనకొద్దు నాయినా ఈ పిల్ల అన్నారు.

సుందరి

విడిచిపెట్టేశారు. ఏం, అంతేనా? సంగీతమన్నా, కళలన్నా ప్రాణం అన్నారు కాదండీ?

కృష్ణారావు

అప్పుడు ఓ విధంగా నాకు చిన్నతనం. పెద్దలంటే భయం. అయినా అదంతా నీవిషయంలో—నువ్వు—

సుందరి

ఇప్పుడు పెద్దల్ని ధిక్కరించేపాటి శక్తిమంతులయారన్నమాట. నేను? ఆగారేం? నేనూ పాటలు పాడేదాన్నేగా! పైగా సినీమాల్లో కూడా జేరమన్నారు! నన్నేంజేస్తారు? దబ్బున చెప్పండి మళ్ళీ మావాళ్ళొచ్చేస్తారు.

(అమ్మాయీ! అని పిలుపు. సుందరి ఆఆ ఇక్కడున్నా అని పలుకుతుంది.)

కృష్ణారావు

ఎవరు మీ నాన్న ఆ వచ్చేఆయనా? ఐతే నువ్వు ఈశాస్త్రిల్లుగాడి కూతురు సుందరమ్మవా? 'లక్ష్మి సుందరి' అంటే ఎవరో అనుకున్నాను. గనకనే సినీమాలనగానే ఎగిరి గంతేసి వప్పుగున్నావు. ఇంతకీ నేనూ ఇంతసేపై — పెళ్ళాడి వదిలిపెట్టేసిన పెళ్ళాంతోనా మాట్లాడుతున్నాను?

(చురుకుగా వెళ్ళిపోతాడు.)

సుందరి

(నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడుతుంది, మళ్ళీ తేరుకుని నవ్వుకుంటూ వెళ్ళిపోతుంది.)